శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## అశ్వవాహనంపైన ఆత్మారామస్వామి గ్రామోత్సవం



**సంగం జూన్ 25 ప్రభాతవార్త** సంగం మండలం అన్నారెడ్డి పాళెం గ్రామంలో శ్రీసీతా లక్ష్మణ సమేత ఆత్మారామస్వామి వారి బ్రహ్మోత్సవాల లో భాగంగా స్వామి వారు అశ్వవా హ నంపైన భక్తులకు దర్శన మిచ్చారు.స్వామి వారిని సుగంద పరి మళ పుష్పాలతో అలంకరించారు. స్వామి వారు అశ్వవాహ నం పైన ఉండి బాణాలు సందిస్తు అర్చకులు నిర్వహించిన ఆట చూపరులను ఆకట్టుకుంది.ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా బండా బలరామిరెడ్డి స్పెషిపిక్ ఎండోమెంట్, బండా మల్లికార్జునరెడ్డి, కీర్తిశేషులు బండా నారాయణరెడ్డి, బండా హరికిషోర్‌రెడ్డి,శిద్దారెడ్డి సుధాకర్‌రెడ్డి వ్యవహారించారు.అర్చ కులుగా వేదగిరి సత్యనారాయణా చార్యులు,రాజ్‌కుమార్‌స్వామి,భరత్‌స్వామి వ్యవహారించారు. కార్యక్రమాలను ఆలయ ఇఒ ప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

## దేవాదాయ శాఖ మంత్రిని అభినందించిన పెళ్లకూరు



**కోవూరు, జూన్ 25 ప్రభాత వార్త** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆనం రామనారాయణరెడ్డిని తెలుగుదేశంపార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి కలిసి శాలువా,పుష్పగుచ్ఛంతో ప్రత్యేకంగా అభినందించారు. కోవూరుకు సంబంధించిన పలు విషయాలపై చర్చించారు.

## ఎన్.ఎం.ఆర్,దినసరి ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు



**నెల్లూరు అర్బన్,జూన్25,ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలో ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఎన్.ఎం ఆర్,దినసరి ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.లవన్న అధికారులను ఆదేశించారు.మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో ప్రభుత్వ సంస్థల్లో ఎన్ఎంఆర్ దినసరి వేతనాల ఉద్యోగులకు కనీస వేతనాల అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలో 2024-25 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఎన్ ఎంఆర్,దినసరి వేతనాలు ఉద్యోగులకు వేతనాలు అమలు చేయడానికి కమిటీ నిర్ణయించిందన్నా రు.నైపుణ్యం లేని ఉద్యోగులకు 560రూపాయలుగా,అరథ నైపుణ్యం కలిగిన వారికి 794రూపాయలు,ఉన్నత స్థాయి నైపుణ్యం కలిగిన వారికి 907రూపాయలు వేతనాలు ఇవ్వాలని కమిటీ నిర్ణయించడం జరిగిందన్నారు.కమిటీ నిర్ణయించిన వేతనాలు 2025మార్చి నెల వరకు అమల్లో ఉంటాయన్నారు.అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖల్లో అమలు చేయాలని ఆయన అన్నారు.ఈ సమావేశంలో కార్మిక శాఖ ఉప కమీషనర్ ఎం.వెంకటేశ్వరరావు,పంచాయతీ రాజ్ ఎస్.ఇ అశోక్‌కుమార్,ఆర్అండ్‌బి ఎస్.ఇ గంగారావు,బి.ఎస్.ఎన్ ఎల్ జనరల్ మేనేజర్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైను కాలువల పూడికతీత క్రమంతప్పకుండా చేపట్టండి: కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్,జూన్ 25,ప్రభాతవార్త**:వర్షాకాలంలో వరద నీరు ప్రవహించేందుకు వీలుగా అన్ని ప్రధీన డ్రైను కాలువల్లో పూడికతీత పనులను క్రమంతప్పకుండా చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు.స్థానిక 14వ డివిజన్ బాలాజీ నగర్ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను కమిషనర్ మంగళవారం పరిశీలించారు.డ్రైను కాలువల పూడికతీత నిర్వహించాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ భువనేశ్వర్ ప్రసాద్ అందించిన వినతి మేరకు వివిధ ప్రాంతాల్లో జరుగుతన్నదీ సిల్ట్ పనులను పర్యవేక్షించారు.డ్రైను కాలువల నుంచి తొలిగించిన సిల్ట్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.డ్రైను కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు,ఇతర వ్యర్థాలను నేరుగా వేయరాదని,ప్రవాహానికి అడ్డంకిగా మారుతాయని స్థానిక ప్రజలకు వివరించాలని కమిషనర్ సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వర్ ప్రసాద్,నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఈ.ఈ సంజయ్,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ,శానిటేషన్ ఇన్స్పెక్టర్ లు,సచివాలయం కార్యదర్శులు,సిబ్బంది పాల్గొన్నారు.

## జోనల్‌స్థాయి స్కేటింగ్ పోటీల్లో డాక్టర్‌కిషోర్ రత్నం విద్యార్థి ప్రతిభ



**నెలూ ్లరు,జూన్25 ప్రభాతవార్త-విద్య** ఇటీవల తిరుపతి లో నిర్వహించిన జోనల్ స్థాయి స్కేటింగ్ పోటీల్లో నగరంలోని స్థానిక డాక్టర్ కిషోర్స్ రేస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఎన్.సా మన్విత్ రింక్-2 బంగారు పతకాన్ని, రింక్-3లో వెండి పతకాన్ని సాధించి సత్తా చాటాడు. స్థానిక పాఠశాలలో విద్యార్థికి అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. విద్యాసంస్థల జిఎం రామూర్తి నాయుడు విజేతకు పుష్పగుచ్చం అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తమ విద్యార్థి జోనల్ పోటీల్లో బంగారు పతకం సాధించటం సంతోషంగా ఉం దన్నారు. తమ విద్యాసంస్థల అధినేతలు డాక్టర్ కిషోర్, వాసంతి కిషోర్‌లు విజేతలను ప్రత్యేకంగా అభి నందించ జరిగిందన్నారు. భవిష్యత్‌లో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆయన కోరారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఆనంని కలిసిన విఎస్‌యు జిఎం సుందరవల్లి



**నెల్లూరు, జూన్ 25, ప్రభాతవార్త - వైద్యం** : దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డిని విక్రమ సింహపురి విశ్వవి ద్యాలయ ఉపకులపతి జిఎం సుందరవల్లి రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మం గళవారం నగరంలోని సంతపేటలో గల క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి విసి, రిజిస్ట్రార్ మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విక్రమ సింహపురి యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోర్సుల వివరాలు, యూనివర్సిటీ ప్రగతి, అభివృద్ధి పనులు తదితర అంశాలను వైస్ చాన్సలర్ సుందరవల్లి, రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి మంత్రికి వివరించారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని, అధ్యాపకులు, సిబ్బంది అందరూ సమిష్టిగా పనిచేసి విక్రమ సింహపూరి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు.

# కొత్త చట్టాలపై పోలీస్ అధికారులకు అవగాహన



**నెల్లూరు క్రైం, జూన్ 25, ప్రభాతవార్త** పోలీసు అధికారులకు కొత్త చట్టాలపై అవగాహన పెంచేందుకు జిల్లా ఎస్పి కె. ఆరీప్ హఫీజ్ వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. నూతన చట్టాలు జూలై 1వ తేది నుండి అమలులోకి రానున్న నేపథ్యంలో, నూతన చట్టాలపై పోలీస్ అధికారులకు, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలనే ఉద్దేశంతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎస్‌పి ఆదేశాల మేరకు జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పోలీసు అధికారులకు కొత్త చట్టాలను వివరించిన అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్)(క్రైం) లీగల్ అడ్వైజర్ అవగాహన కల్పించారు. కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, ప్రతి అంశాన్ని పఠించాలని పేర్కొన్నారు. కేసులు దర్యాప్తు చట్ట పరిధిలో జరపాలని, నియమాలను పాటిస్తే ముద్దాయిలకు శిక్షలు పడతాయని తెలిపారు. భారత ప్రభుత్వం ప్రస్తుత సమాజానికి అనుగుణంగా మార్పులు చేసి వాటి స్థానాలలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం అను నూతన చట్టాలను భారత ప్రభుత్వం రూపొందించడం జరిగిందన్నా రు. ఈ వీడియో కాన్ఫిరెన్స్ నందు అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) సిహెచ్ సౌజన్య, అడిషనల్ ఎస్పి (క్రైమ్స్) ఏవిఆర్ ప్రసాద్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, ఫైబర్ సిఐ హుస్సేన్ భాషా, ఎస్సై సురేష్, ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై పంచాయతీ నిర్లక్ష్యం



కోవూరు, జూన్ 24 ప్రభాతవార్త : ఇది వర్షపునీరు కాదు.. మురుగు కాలువలను సక్రమంగా పారిశుధ్య సిబ్బంది తీయకపోవడంతో ఆ వచ్చిన మురికి నీరు అంతా రహదారిపై చేరి ఇటు పాదాచారులను అటు ద్విచక్ర వాహనచోదకులను తీవ్రంగా ఇబ్బంది పెడుతుంది. ఈ దుస్థితి ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో కాదు.. కోవూరు పంచాయతీ నడిబొడ్డున రామిరెడ్డితోట ప్రాంతంలో నెలకొంది. ఈ దుస్థితి ప్రతిరోజూ ఈ ప్రాంత వాసులకు పరిపాటి అయిపోయింది. కోవూరు పంచాయతీలో పారిశుధ్య సిబ్బంది ఉన్నా ఆశించిన మేర పర్యవేక్షణ లేకపోవడంతో మురికి కాలువలు పొంగి ప్రవహించి ఎటు చూసినా చెత్తాచెదారాలు దర్శనమిస్తున్నాయి. ఫలితంగా ప్రజలు అంటురోగాల బారిన పడి ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మండలంలోనే కోవూరు పంచాయతీకి అత్యధిక జనాభా కలిగి ఉన్నారు. సకాలంలో అన్ని వనరులు పంచాయతీకి సమకూరుతున్నా సర్పంచ్ కానీ, సంబంధిత వార్డు మెంబర్లు కానీ పారిశుధ్యంపై ఏనాడు కూడా దృష్టి పెట్టిన దాఖలాలు లేవు. ఫలితంగా ప్రజలు అపరిశుభ్ర వాతావరణంలో బతుకు సాగదీయాల్సిన దుస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ప్రజల్లో కూడా పరిసరాల పరిశుభ్రత పారిశుధ్యంపై ఆశించిన మేర అవగాహన లేకపోవడంతో మురుగు కాలువలు సైతం వారు చెత్త కుండీలుగా మారుస్తున్నారు. ఫలితంగా మురుగు కాలువలు నిండిపోయి ఆ నీరంతా రోడ్లపై ప్రవహించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఈ విషయంలో అధికారులు దృష్టి సారించకపోతే డయేరియా వంటి అంటురోగాలు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంది. పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోగాల బారిన ప్రజానీకం



# అధికారుల నిర్లక్ష్యం...ప్రజాధనం వృధా



**బిట్రగుంట, జూన్ 25 ప్రభాతవార్త :** మండల హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల వందలాది సిమెంట్ బస్తాలు గడ్డకట్టి నిరుపయోగంగా మండల పరిషత్ కార్యాలయం వెనుక పడవేయడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బోగోలు మండలంలో పేదవారికి సొంత ఇల్లు కలనెరవేర్చేందుకు గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరిట సబ్సిడీపై సిమెంటు, ఐరన్ సరఫరా చేసింది. అయితే అధికారులు వాటిని లబ్దిదారులకు సకాలంలో అందజేయకపోవడంతో వందలాది సిమెంట్ బస్తాలు గడ్డకట్టి పోయాయి. దీంతో ప్రజాధనం దుర్వినియోగమైంది. హౌసింగ్ కార్యాలయం ఎదుట ఇంటి నిర్మాణానికి సరఫరా చేసే ఐరన్ తుప్పుపట్టింది. గడ్డకట్టిన సిమెంట్ బస్తాలు గుట్టుచప్పుడు కాకుండా ఎంపిడివో కార్యాలయం వెనుకాల వ్యర్థంగా పడవేశారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## టీచర్ల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతా కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి



**కావలి, జూన్ 25 ప్రభాతవార్త** టీచర్ల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి(కావ్య కృష్ణారెడ్డి) హామీ ఇచ్చారు. మంగళవారం ప్రభుత్వ టీచర్లు ముసునూరులోని ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. టీచర్ల సమస్యల్ని వైసిపి పాలనలో పడిన అవస్థల్ని ఎమ్మెల్యే కావ్య దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే కావ్య మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో అన్ని వర్గాల సమస్యల్ని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. అభివృద్ధి ప్రదాత, విజన్ వున్న నేత మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని కొనియాడారు. అన్ని వర్గాలు టిడిపి పాలనలో సుఖంగా వుంటారన్నారు.

## కన్నుల పండుగగా వెంగమాంబ అమ్మవారి బ్రహోత్సవాలు



రథంపై పురవీధుల్లో ఊరేగుతున్న వెంగమాంబ దంపతులు

**దుత్తలూరు,జూన్25,ప్రభాతవార్త** జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నరవాడ గ్రామంలో వెలసిన శ్రీ వెంగమాంబ పేరంటాల బ్రహోత్సవాలు కన్నుల పండుగగా సాగుతున్నాయి.అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తుతున్నారు.బ్రహోత్సవాల్లో భాగంగా మూడోరోజు అయిన మంగళవారం గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై పేరంటాలమ్మగురవయ్య నాయుడు దంపతులు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.సంతానం లేని మహిళలు ఉపవాస దీక్షతో వెంగమాంబకు వరవడి మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయం నుండి గ్రామోత్సవం కన్నుల పండుగగా ప్రారంభమై నరవాడ గుదేవారిపాలెం ,ఉలవారిపాలెం,బీసీ కాలనీల మీదుగా సాగింది.తొలుత నరవాడలో ఉత్సవ విగ్రహాలకు వెంగమాంబ వంశీయులు వేద పండితుల ఆధ్వర్యంలో చక్రస్నానం చేయించారు.స్వామివార్లకు పులివర్తి వంశీయులు పట్టు వస్త్రాలను సమర్పించారు.ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవాలకు వారు ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవానికి తరలించారు.గ్రామత్సవంలో అమ్మవారి వాహనం వెంట మహిళలు వారి కడువలతో నీరు ప్రోసి కాయ,కర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.శ్రీ వెంగమాంబ దంపతుల కళ్యాణోత్సవం ప్రధానోత్సవం జరుగుతుంది.ఈ సందర్భంగా పసుపు,కుంకుమ ఉత్సవ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.వెంగమాంబ అమ్మవారి ఉత్సవాలకు ప్రధాన రోజులైన బుధ,గురువారాల్లో భారీ సంఖ్యలో భక్తుఉ తరలి రానుండడంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందు జాగ్రత చర్యలు చేపట్టినట్లు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఉదయగిరి సర్కిల్ సిఐ.వి.గిరిబాబు తెలిపారు.ఈ కార్యక్రమానికి ఒక డిఎస్పీ స్థాయి అధికా నలుగురు సిఐలు,15మంది ఎస్సైలు,56మంది ఏఎస్సైలు,97మంది హెడ్‌కానిస్టేబుళ్లు,83మంది హోంగార్డులు,దుత్తలూరు ఎస్సై ఉమా శంకర్‌తోపాటు మొత్తం 253మంది సివిల్ సిబ్బందితోపాటు 30మంది స్పెషల్ ఏఆర్ పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.బుధవారం అమ్మవారి బ్రహోత్సవాలకు రాష్ట్రస్థాయి మంత్రులు జిల్లా స్థాయి ఉన్నత అధికారులు,స్థానిక రాజకీయ ప్రతినిధులు తదితరు హాజరవుతారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



# ఏసిబీ వలలో మరో చేప

## విద్యుత్ శాఖలో విచ్చలవిడి లంచగొండితనం
### ప్రతి పనికి ఓ రేటు



**నెల్లూరు, జూన్ 25, ప్రభాతవార్త - వైద్యం :** ఏసీబీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్న విద్యుత్ శాఖలో మాత్రం తీరు మారడం లేదు. తాజీగా ఆ శాఖలో మరొక అవినీతి చేప ఏసిబికి చిక్కింది. ఈ మేరకు కొత్తూరు అక్కచెరువుపాడులో ఉన్న ఓ లేఔట్‌కి సంబంధించి విద్యుత్తు లైను కోసం ఆ లేఔట్ యజమాని హరిప్రసాద్‌ని మొదట ఏఈ శివ శంకరయ్య 80 వేల రూపాయిలు డిమాండ్ చేసారు. అయితే తాను అంత ఇచ్చుకోలేనని 50 వేల రూపాయిలకు హరిప్రసాద్ ఒప్పందం చేసుకున్నారు. అయితే తాను అంత ఇచ్చుకోలేనని ప్రాధేయపడిన కూడా అయితే సర్వీసు ఇవ్వనని కారాకండిగా చెప్పినట్లు తెలుస్తోంది. బాధితుడు విధిలేని పరిస్థితుల్లో కనెక్షన్ కోసం ఏసిబీని ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఈ తరుణంలో రూ. 50 వేలు లంచం తీసుకుంటూ విద్యుత్ శాఖ నెల్లూరు రూరల్ 2, ఏఈ రూ. 50 వేలు లంచం తతీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) అధికారులకు మంగళవారం నెల్లూరు రూరల్ 2 వై. శివశంకరయ్య పట్టుబడ్డారు. సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీరు వై శివశంకరయ్య ఉదంతంతో ఏపి దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, నెల్లూరు సర్కిల్ పరిధిలోని పలువురు అవినీతి అధికారుల్లో ప్రకంపనలు మొదలైనట్లు తెలుస్తోంది. ప్రజల నిత్యవసరాల్లో ప్రాధాన్యతను సంతరించుకున్న విద్యుత్ శాఖలో అడ్డదారి సంపాదనకు అలవాటు పడిన పలువురు ఇంజనీరింగ్ అధికారులు నిర్వాకం వల్ల ప్రతి పనికి ముక్కు పిండి పైసలు వసూలు 1288 చేస్తున్న ధనదాహపూరిత చర్యలు సామాన్య వినియోగదారులను సైతం ఆందోళనకు గురిచేస్తున్నాయి. సొంత లాభంతో కూడిన ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్న కొందరు విద్యుత్ అధికారులఉ అనుసరిస్తున్న లోపాయికారి చర్యల వల్ల మాతృసంస్థ విద్యుత్ శాఖ అభివృద్ధికి మూలకారణమైన ఆర్థిక వనరులను కాపాడుకోవడంలో విఫలమయ్యార నేందుకు అనేక సంఘటనలు నిలువెత్తు సాక్ష్యంగా ఉన్నాయి. సుమారు 3 లక్షలు 76 స్క్వయర్ కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఉమ్మడి నెల్లూరులోని ఆరు విద్యుత్ ఆపరేషన్ డివిజను 19, సబ్ డివిజన్లు, 79 విద్యుత్ సెక్షన్లు 11 కెవి ఫీడర్స్ 983 కింద ఉన్న 17 ఎలక్ట్రికల్ రెవెన్యూ కార్యాలయాలు, 202 విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని 9.73 లక్షల మంది వినియోగదారులకు (గృహ విద్యుత్ సర్వీసులు 1064695, కమర్షియల్ 1055012 సర్వీసులు, ఎలే ఇండస్ట్రీస్ సర్వీసులు 7103, రిసార్ట్స్, దోభీ ఘాట్ 954, అగ్రికల్చర్ సర్వీసులు 191373 వీధి దీపాలు 14823, ఆక్వా రంగానికి చెందినవి. 32357 తాత్కాలిక సర్వీసులు 58 పరిసర ప్రాంతాలో ఉన్న 100 కెవి ప్రీచిలుకు సామర్థ్యం కలిగిన 658 హెబ్రిటి సర్వీసులు 81.980 ట్రాన్స్‌ఫార్మర్స్) ద్వారా అవసరమైన విద్యుత్ సేవలందించడంలో ఇంజనీరింగ్, కార్యాలయ విభాగాలు, ఫీల్డ్ స్టాఫ్ కలిపి మొత్తం 1800మంది పై చిలుకు ఉద్యోగులుఅవసరమైన విద్యుత్ సేవలందరించడంలో చొరవ చూపుతున్నప్పటికీ ప్రతల్యేకించి ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని బహిరంగ వమాళ్ల దందా జోరుగాసాగు తున్నట్లు విమర్శలు గుప్పుమంటున్నాయి. వేలవేల జీతాలు తీసుకుంటున్న అధికారులు తీరుమాత్రం మారడం లేదని ప్రజలు వాపోతున్నారు.

## దానమయ్య కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**సీతారామపురం జూన్ 25 ప్రభాతవార్త :** సీతారామపురం మండలంలోని మారంరెడ్డిపల్లి గ్రామంలో టిడిపినాయకులు కలివెల దానమయ్య ఇటీవల మృతి చెందడంతో ఉదయగిరి నియోజకర్గ మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతు దానమయ్య కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరపున సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. పార్టీకి దానమయ్య చేసిన సేవలు ఎప్పటికి మరచిపోమని చెప్పారు. ఈకార్యక్రమంలో టిడిపినాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటిబుక్స్ పంపిణి



**సంగం జూన్ 25 ప్రభాతవార్త :** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలోని గిరిజన కాలనీలోని ప్రాధమిక పాఠశాలలో చదువుతున్న బాలబాలికలకు బుచ్చిరెడ్డిపాళెం సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ వారి ఆద్వర్యంలో నోటి బుక్‌లు పలకలు, పెన్సిళ్ళు అందజేశారు. ఈకార్యక్రమంలో సొసైటీ అద్యక్షులు యజ్దానిభాషా మాట్లాడుతు చిన్నపిల్లలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అదిరోహించాలని ఆయన కోరారు. పేద విద్యార్దులకోసం ప్రభుత్వం పెద్ద పీట వేసిందని తల్లిదండ్రులు పిల్లల్ని బాగా చదివిం చాలని ఆయన కోరారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పటాన్‌భాషా పాల్గొన్నారు .రిటైడ్ ఉపాధ్యాయులు గజేంద్రకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## కావలి డివిజన్ విద్యుత్ కార్మికుల సమస్యల్ని వెంటనే పరిష్కరించాలి జెఏసి నేతలు డిమాండ్



**కావలి, జూన్ 25 ప్రభాతవార్త :** కావలి డివిజన్ విద్యుత్ కార్మికుల సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని కావలి జెఏసి నేతలు డిమాండ్ చేశారు. కావలి డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు మంగళవారం వారు వినతి పత్రం అందజేశారు.అనంతరం జెఏసి నేతలు మాట్లాడారు. ఒక సమ్మె చేయాలన్నా, ఒక సమస్య మీద పోరాడాలన్నా కావలి డివిజన్ యూనియన్ లీడర్లు గట్టివాళ్లు అని తెలిపారు. పోరాటాలకు పుట్టినిల్లు కావలి డివిజన్ అని తెలిపారు. అటువంటి విద్యుత్ కార్మికులు, యూనియన్ లీడర్లు వున్నటువంటి కావలి డివిజన్‌లో ఎన్నడూ లేని విధంగా కార్మికులపై కావలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొరడా ఝుళిపించడం అన్యాయమన్నారు. కార్మికులకు రావాల్సిన ప్రమోషన్లు సకాలంలో ఇవ్వడం లేదని తెలిపారు. ఇంజనీర్లకు మాత్రం సకాలంలో ప్రమోషన్లు వస్తున్నాయని తెలిపారు. కార్మికులకు రావాల్సిన టిఏ బిల్లు సకాలంలో ఇవ్వడం లేదన్నారు. పెయిడ్ హాలిడేస్ నెల్లూరు సర్కిల్‌లోని అన్ని డివిజన్లలో ఇచ్చారన్నారు. కావలి డివిజన్‌లో ఇవ్వలేదని తెలిపారు. కావలి డివిజన్‌లో భాగమైన కోవూరు డివిజన్‌లో కూడా పెయిడ్ హాలిడేస్ ఇచ్చారన్నారు. కార్మికుల మెడికల్ బిల్స్ సకాలంలో ఇవ్వడం లేదన్నారు. ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయడం లేదన్నారు. సెక్షన్ ఆఫీసులు, సర్వీసులు పెరుగుతున్నా సిబ్బందిని పెంచడం లేదన్నారు.సప్లై పోతే కార్మికుల జీతాల నుండి డబ్బులు కట్ చేస్తున్నారన్నారు. వర్క్ నారమ్స్ ప్రకారం ఎన్ని సర్వీసులకు స్టాఫ్ వుండాలి అనేది కనుమరుగైందన్నారు. పనిభారం ఎక్కువై కార్మికులు చనిపోతున్నారన్నారు. 40 సంవత్సరాల కాలం చెల్లిన వైర్లు తెగిపడి పశువులు చనిపోతే సిబ్బంది మీద కేసులు నమోదు చేయుచున్నారన్నారు. ఊరిలో వున్న మనుషులకు, పశువులకు ఏదైనా జరిగితే కార్మికులను బలి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిపేర్లు చేసేందుకు అవసరమైన సామాగ్రి ఇవ్వడం లేదన్నారు. సబ్ స్టేషన్లలో మెయింటెనెన్స్ చేసేందుకు మెటీరియల్ ఇవ్వడం లేదన్నారు. విపత్తు సమయంలో స్తంభాలు పడిపోతే ఎమర్జన్సీ కింద ఎటువంటి కాంట్రాక్టర్ రావడం లేదన్నారు. రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే ట్రాన్స్‌పోర్టు వాహనం పెట్టకుండా సిబ్బంది చేత వాహన ఖర్చులు పెట్టిస్తున్నారన్నారు. బిల్లింగ్ ఏజెన్సీలు వున్నా కార్మికులపై వత్తిడి తెచ్చి బిల్లింగ్ చేయిస్తున్నారన్నారు. జిఐయస్ పేరుతో ట్యాబ్స్ ఇవ్వకుండా కార్మికుల మొబైల్ ఫోన్లతో సర్వే తీయించి ఫోన్లు పాడైపోయినా వాటికి న్యాయం చేయడం లేదన్నారు. లైన్ల కింద చెట్లు నరకడం కార్మికుల చేతే చేయిస్తున్నారన్నారు. కావలి డివిజన్‌ను రెండు డివిజన్లుగా డివైడ్ చేశారన్నారు. అధికారులు మాత్రం పోస్టులు భర్తీ చేసుకున్నారన్నారు.కార్మికులను మాత్రం బైఫర్‌కేషన్ చేయలేదన్నారు. అందువల్ల కార్మికులు ప్రమోషన్లలో నష్టపోతున్నారని తెలిపారు. ఈ సమస్యలపై కార్మికులందరూ కలిసి పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కరోనా సమయంలో కూడా సెలవులు లేకుండా విధులు నిర్వహించారన్నారు. ఇంత కష్టపడుతున్న కార్మికులకు కావలి డివిజన్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఇచ్చిన గొప్ప బహుమానం కార్మికులకు రావాల్సిన బిల్లులను నిలిపివేశారని తెలిపారు.దీనిపై అన్ని యూనియన్లు వెళ్లి అడిగితే నేను ఇవ్వను మీరు ఏం చేసుకుంటారో చేసుకోండని సమాధానం చెప్పాడన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెఏసి నేతలు 327 యూనియన్ సెక్రటరీ ఎస్.కె.చందానీబాషా, అధ్యక్షులు పి.వేణుగోపాల్‌రెడ్డి, 1104 యూనియన్ ఎ.శ్రీనివాసులు, యు.రవి, ఓసి యూనియన్ యం.పెంచలనాయుడు, బి.దేవప్రసాద్, ఎస్సీ,ఎస్టీ యూనియన్ నాయకులు కమల్‌కుమార్, డి.కృష్ణమోహన్, బిసి యూనియన్ బి.సత్యం, పి.ప్రసాదు, రీజనల్ నాయకులు 1104 యూనియన్ కొండపల్లి శ్రీనివాసులు, 327 యూనియన్ ఎస్.లక్ష్మీరెడ్డి, ఓసి యూనియన్ బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## నటరాజును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



**కావలి,జూన్ 25 ప్రభాతవార్త :** కావలి పట్టణ వైసిపి కార్యకర్త, మాజీ వాలంటీర్ హనుమకొండ రాజీవ్‌కుమార్ (నటరాజు)నుఆయననివాసంలో కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కావలి నియోజకవర్గంలో ఎటువంటి అరాచకాలు చేస్తున్నారో ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. వైసిపి నాయకులు, కార్యకర్తల ఇళ్ల మీదకు వెళ్లి వారి ఆస్తుల మీద దాడులు చేయడం హేయమైన చర్యఅన్నారు. డాన్స్ నేర్పిస్తూ చిన్నచిన్న డాన్సు కార్యక్రమాలు చేసుకుని జీవనం పొందుతున్న నటరాజును వైసిపి మద్దతుదారుడనే కారణంగా కొంతమంది వ్యక్తులు వెళ్లి మూకుమ్మడి దాడి చేశారన్నారు. అరాచకాలను ప్రోత్సహించడం ఎమ్మెల్యేకు తగదన్నారు. కావలి నియోజకవర్గంలో ఒక వర్గానికి చెందిన మీడియా కావలి పట్టణ మున్సిపాల్టీ పరిధిలో 125ఎకరాల భూమి కబ్జా చేశారని దానికి తాను సహకరించినట్లు అభూత కల్పనలు సృష్టిస్తున్నారని విమర్శించారు.చేతనైతే నిరూపించాలన్నారు. కబ్జాలు చేసి లేఅవుట్లు వేసి ఎవరికైనా అమ్మిన యెడల వివరాలు బయటపెడితే మా ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలు గురించి తెలుస్తుందని వాటిమీద చర్యలుతీసుకోవాలని మేము కూడా కోరుతామన్నారు.ఈఅక్రమ లేఅవుట్లకు సంబంధించి ఎవరైనా నష్టపోతే బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

## తిరుమల పాదయాత్ర బృందానికి నువ్వుల ఆర్థిక సాయం



**రాపూరు,జూన్25ప్రభాతవార్త :** రాష్టంలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు భాద్యతలుస్వీకరించడంతో మొక్కులు చెల్లించుకునేందుకు తిరుమలకు పాదయాత్రగా వెలుతున్న వారికి తిరుపతి పార్లమెంట్‌అధికారిక ప్రతినిధి నువ్వుల శివరామకృష్ణ ఆర్థిక సాయం ఆందజేశారు. ఒంగోలు నుండి తిరుమలకు కలినడకనపాదయాత్ర చేస్తున్న తెలుగుదేశం పార్టీ యూత్ కార్యకర్తలకు ఆయన దారి ఖర్చుల నిమిత్తం మంగళవారం ఈ సాయం ఆందజేసి వారిని అభినందించారు.

## లేబాకుల సోదరులకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



**కావలి, జూన్ 25 ప్రభాతవార్త :** బామా వ్యవస్థాపక కార్యదర్శి, ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగి లేబాకుల సుధాకర్‌రెడ్డి మృతికి కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి నివాళులర్పించారు. మంగళవారం లేబాకుల నివాసానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వుంచి ప్రతాప్‌రెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సుధాకర్‌రెడ్డి సోదరుడు శేషారెడ్డి మృతికి మాజీ ఎమ్మెల్యే నివాళి.లేబాకుల సుధాకర్‌రెడ్డి సోదరుడు లేబాకుల శేషారెడ్డి మృతదేహంపై కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పూలమాల వుంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనకు అత్యంత సన్నిహితులైన లేబాకుల సుధాకర్‌రెడ్డి, ఆయన సోదరుడు శేషారెడ్డిలను కోల్పోవడం ఎంతో బాధాకరమన్నారు. అన్నదమ్ములిద్దరికి ఒకే రోజు అంత్యక్రియలు జరగడం జీర్ణించుకోలేకపోతున్నామని తెలిపారు.

## అన్న అంత్యక్రియలలో పాల్గొన్న తమ్ముడు మరణం విషాదమైంది





**కావలి, జూన్ 25 ప్రభాతవార్త :** బామా, నా ఫౌండేషన్ బాధ్యులు, ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగి లేబాకుల సుధాకర్‌రెడ్డి అంత్యక్రియలలో పాల్గొన్న తమ్ముడు శేషారెడ్డి అందరితో మాట్లాడుతూ ఆకస్మికంగా మృతి చెందిన సంఘటన కావలిలో విషాదంగా మారింది. అన్న అంత్యక్రియలు పూర్తి చేస్తున్న సమయంలో తమ్ముడు శేషారెడ్డి ఉన్నపళంగా గుండెపోటు రావడం హుటాహుటిన నెల్లూరు వైద్యశాలకు తరలించడం మృతి చెందాడన్న వార్త ఇక్కడికి చేరడంతో లేబాకుల నివాసం విషాదమైంది.క్రిస్టియన్‌పేటలో లేబాకుల సుధాకర్‌రెడ్డి అంత్యక్రియలు సాయంత్రం సోదరుడు శేషారెడ్డి అంత్యక్రియలు ఒకే రోజు జరగడం కుటుంబ సభ్యుల్ని, స్నేహితుల్ని కలవరపర్చింది. కావలి పట్టణంలో అందరికి సుపరిచితులైన అన్నదమ్ములిద్దరు తిరిగి రాని లోకాలకు తరలివెళ్లడంతో అందరి కళ్లు చెమర్చాయి.

## 10వ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు

**మర్రిపాడు, జూన్25,ప్రభాతవార్త :** మండలంలోని చుంచులూరు ఉన్నతపాఠశాలలో గత సంవత్సరం జరిగిన 10వ తరగతి పరిక్షా ఫలితాల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన కలిశెట్టి జా క్షపిక, ఇందూరు లక్ష్మీప్రసన్న, పవన్‌కళ్యాణ్‌లకు కీ.శే.వేమన ఓబయ్య, జయరత్నమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు శ్యాంప్రసాద్, వెంకటసురేష్, కృష్ణకిషోర్‌లు 10వేలు, **7500 , 5000** రూపాయల వంతున నగదు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం వేమన వెంకట సురేష్ కెనడాలోని అల్బెర్టా యూనివర్శిటీ గౌరవ గవర్నర్‌గా ఎంపికైనా సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి విద్యార్థులను ప్రోత్సహించడం శుభపరిణామమన్నారు. ఈ పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకొని ప్రస్తుతం కెనడాలోని అల్బెర్టా యూనివర్శిటీలో గౌరవ గవర్నర్‌గా పదవి అలంకరించిన వెంకటసురేష్‌కు అభినందనలు తెలిపారు. నగదు ప్రోత్సాహకాలు అందజేసిన వేమన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ అన్ని దానాల కన్నా విద్యాదానం గొప్పదని చదువులో ముందంజలో ఉండే విద్యార్థులకు సహకారాన్ని అందించడానికి తాము ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటామని ఈపాఠశాల అభివృద్ధికి తమ సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో విశ్రాంత మండల విద్యాశాఖాధికారి జొన్నా సత్యనారాయణ, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కలిశెట్టి వెంకట రమణయ్య, కలిశెట్టి రాజేంద్రకుమార్, వనం నర్సింహులు, ఉపాధ్యాయులు, డి.వి.రమణయ్య, అశోక్ , పెంచలరావ్, మల్లిఖార్జున స్వామి, శివశంకరయ్య, చైతన్య ,మురళీకృష్ణ, నయీం, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనజాతర మహాసభ కరపత్రం ఆవిష్కరణ



**గుడ్లూరు, జూన్ 25, ప్రభాతవార్త :** ఎమ్మార్పీఎస్ పురిటిగడ్డ ఈదుమూడి గడ్డపై మాదిగల జనజాతర మహాసభ జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ రోజున సభ జరుగుతుందని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గౌడపేరు కృష్ణ మాదిగ తెలిపారు. సభకు సంబంధించిన కరపత్రం గుడ్లూరు మండలంలోని ఐమంత్రి స్కూల్ నందు ఆవిష్కరించారు. మండల అధ్యక్షులు గౌడపేరు దానియేలు మాదిగ అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఈ సభకు ముఖ్య అతిధిగా ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు గౌడపేరు జాను సుందరం హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో గౌడపేరు ఎలీషా, గౌడపేరు సుధాకర్, వర్ల అశోక్, అక్కిలిగుంట రామకృష్ణ, పి.యేసేబు, జి.సన్ని, వై.సందీప్, జి.చైతన్య, కే.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పిల్లిపెసర్లు పంపిణీ



**మనుబోలు, జూన్ 25, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మనుబోలు రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ఉదయం తెలుగుదేశం పార్టీ నాయకుల సమక్షంలో మండల వ్యవసాయ శాఖ ఏవో జకీర్ సమక్షంలో రైతులకు పిల్లిపెసరలు పంపిణీ చేశారు. వచ్చే సీజన్‌లో రైతులకు పచ్చిరొట్టె విత్తనాల పంపిణీలో భాగంగా వ్యవసాయ శాఖ పిల్లిపెసర్లను 50శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు వ్యవసాయాధికారి జకీర్ తెలిపారు. రైతులకు పది క్వింటాళ్లు మనుబోలుకు కేటాయించింది. ఐదు క్వింటాళ్లు ప్రస్తుతం ఇస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు రాయపాటి కిరణ్‌కుమార్, రావుల అంకయ్య చేతుల మీదుగా రైతులకు పిల్లిపెసరల బ్యాగ్‌లను అందజేశారు. కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందని, రైతులు వ్యవసాయ పనిముట్లు, సబ్సిలో ఇస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాబోవు రోజుల్లో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నియోజకవర్గంలో రైతులకు ఏదీ కావాలన్నా అండగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మారంరెడ్డి రమణారెడ్డి, కలికి రమేష్‌రెడ్డి, శివుడు రాజాగౌడ్, మామిడి ప్రసాద్, బోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ తేజస్విని పాల్గొన్నారు.

## జూలై 7న మాదిగల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయండి



**ఉదయగిరి,జూన్25,ప్రభాతవార్త:** జూలై 7వ తేదీ వరంగల్లో జరిగే మాదిగల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బకీర్ జాషువా పిలుపునిచ్చారు.మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరుగు మాదిగల ఆత్మగౌరవ కవాత్‌ను జయప్రదం చేయాలని ఆయన కోరారు.ముందు రోజు అనగా జూలై 6న మండలస్థాయిలో ఎమ్మార్పీఎస్ జెండాలు ఆవిష్కరించి మధ్యాహ్నం నుండి వరంగల్లో జరుగు సభను జయప్రదం చేయాలన్నారు.దాదాపుగా 10లక్షల మంది హాజరవుతున్న ఈ మహాసభకు ప్రతి గ్రామంలోని మాదిగ సోదరులు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.ఎమ్మార్పీఎస జిల్లా సీనియర్ నాయకులు బెజవాడ బాల గురవయ్య మాట్లాడుతూ ఆత్మగౌరవ కవాతు సభకు వచ్చే వారందరూ విధిగా డ్రెస్‌కోడ్(తెల్ల చొక్కా,నల్ల ప్యాంటు,ఎమ్మార్పీఎస్ కండువా)లు ఖచ్చితంగా ధరించి కవాతు సభను జయప్రదం చేయాలన్నారు.

## మహిళపై అసభ్యపదజాలంతో తిట్టిన వ్యక్తిపై ఫిర్యాదు

**మనుబోలు, జూన్ 25, ప్రభాతవార్త :** మండలంలోని వీరంపల్లి గ్రామంలో తరచు ఇంటి ముందుకు వచ్చి దూషిస్తున్నారంటూ స్రవంతి అనే గృహిని మంగళవారం సాయంత్రం ఎస్సై అజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేసింది. గ్రామానికి చెందిన పసుపులేటి ప్రసాద్ అనే వ్యక్తి తరచూ వచ్చి నా ఇంటి ముందు నానా దుర్భాషలాడుతూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడి అవమాన పరుస్తున్నాడని ఆమె ఎస్సైకి తెలిపింది. జనవరి ఫస్ట్ రోజు ఇలాగే తనను తిట్టినా ఓర్చుకున్నానని, ఇప్పటికి ఐదారు సార్లు ప్రసాద్ తన ఇంటి ముందు బూతులు తిడుతూ తాను ఉండే ప్రాంతంలో అవమానకరంగా మాట్లాడుతున్నాడని ఆమె తన తల్లి తిరుపాలమ్మతో కలిసి వచ్చి ఫిర్యాదు చేసింది. తనను తిడుతున్న సమయంలో సెల్‌ఫోన్‌లో మాటలు రికార్డింగ్ చేసిన వాయిస్‌ను ఎస్సైకి వినిపించింది. వెంటనే ఎస్సై అజయ్‌కుమార్ స్పందిస్తూ ఆ వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించి విచారించి కఠిన చర్యలు తీసుకుంటుందని, ధైర్యంగా ఉండమని మహిళకు హామీఇచ్చారు.

## బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి



**కోవూరు, జూన్ 25 ప్రభాతవార్త :** బడి ఈడు కలిగిన పిల్లలు బడిలోనే ఉండాలని ప్రభుత్వం ఇచ్చే పూర్తి అవకాశాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలోకి రావాలని ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా సమన్వయకర్త ఎల్‌వీకేఎస్ సుబ్రహ్మణ్యం అన్నారు. కోవూరు మండలం నేతాజీనగర్ , చంద్రమౌళినగర్ గిరిజన కాలనీలో సోమవారం నేను బడికి పోతా సంబంధించి గ్రామాల పురవీధుల్లో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలు అంతా నిర్బంధ ఉచిత పాఠశాల విద్యను తప్పక అభ్యసించాలన్నారు. బడి ఈడు కలిగిన పిల్లలను ఎక్కడైనా పనిలో ఉంచినట్లయితే అటువంటి వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేయడం కూడా జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా చిన్నారుల బాల్యాన్ని హరించే హక్కు తల్లిదండ్రులకు లేదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పిల్లలు బడిలో ఉండాలి.. పెద్దలు పనిలో ఉండాలి అనే విషయాన్ని ప్రతి తల్లిదండ్రులు పూర్తిగా అవగాహన చేసుకోవాలన్నారు. ప్రస్తుతం విద్య కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపడుతుందని , వేలాది కోట్లు ఖర్చు చేసి పాఠశాలలను మౌళికంగా అభివృద్ధి చేయడమే కాకుండా సాంకేతికంగా డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా సర్వశిక్ష అభియాన్ ఏఎంవో జి. సుధీర్, ఐటీడీఏ ఏఎంవో శాంతికుమారి, ఏపీవో ప్రసాద్, ఉర్దూ డీఐ ఎస్‌కే ఖాజామొహిద్దీన్, మండల విద్యాశాఖ అధికారి-2 వై. చెంచులక్ష్మమ్మలు పలు సూచనలు చేశారు. పురవీధుల్లో చేపట్టిన ర్యాలీ ప్రతి ఒక్కరిని ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కోదండరామయ్య, ఎండీ జావిద్, విద్యార్థులు ఉన్నారు.

## బీసీజీ వ్యాక్సిన్ వలన అనేక ఉపయోగాలు



**కోవూరు, జూన్ 25 ప్రభాతవార్త :** సమాజంలో 60 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ బీసీజీ వ్యాక్సినేషన్ వేయించుకోవడం వలన వారికి అనేక ఉపయోగాలు ఉన్నాయని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్లు ఎస్‌కే ఇలియాజ్, ఎస్‌కే దిలీప్‌లు తెలియజేశారు. ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆదేశాల ప్రకారం కోవూరు మండలంలో ఉన్న ఫెడోరా రొయ్యల మేత కర్మాగారంలో పని చేస్తున్న కార్మికులకు సోమవారం అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వారు బీసీజీ ఇంజెక్షన్ వేసుకోవడం వలన వారిలో రోగనిరోధక శక్తి మరింత పెరుగుతుందన్నారు. ప్రతి గురువారం ఈ బీసీజీ వ్యాక్సినేషన్ కోవూరు మండలంలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రాల్లో వేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ వ్యాక్సినేషన్‌ను ప్రతి ఒక్కరూ పూరిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికె.చంద్రకిరణ్, పి. సుబ్రహ్మణ్యంలు ఈ వ్యాక్సినేషన్‌పై కార్మికులకు ఉన్న సందేహాలను నివృతి చేశారు.

## పంపింగ్ ద్వారా మండలంలో రైతులకు సాగునీరు అందించాలి

**రాపూరు,జూన్25ప్రభాతవార్త :** పంపింగ్ ద్వారా రాపూరు మండలంలోని పలు గ్రామాలలోని రైతుల భూములకు సాగునీరు అందించాలనిబిజేపి నమామిగంగే రాష్ట కన్వీనర్ మిడతల రమేష్ కోరారు. మంగళవారం ఆయన రాపూరు మండలంలోనికండలేరులో పర్యటించారు.ఈసందర్భంగా ఆయన జళాశయంలో వున్న డెడ్ స్టోరేజ్ నీటిని, హెడ్ రెగ్యులేటర్‌వద్ద డ్యాం గేట్లను, పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో సాగునీటిసౌకర్యం లేనందున పంపింగ్ ద్వారా జళాశయం నుండి 30 టియంసీల సామర్థ్యం నుండి వెలుగోను చెరువుకుఅక్కడి నుండి రాపూరు పెద్ద చెరువుతో పాటు పది గ్రామాల చెరువులకు సాగునీరు అందించాలని కండలేరుఎఇ తిరుమలయ్యకు వినతిపత్రం సమర్పించారు.అలాగే డెడ్ స్టోరేజ్ నీటికి హెడ్ రెగ్యులేటర్‌కు మధ్య 3 కిలోమీటర్లదూరం వుందని ఈ భాగంలో పేరుకుపోయిన బురదను తొలగిస్తే డెడ్ స్టోరేజ్‌లో వున్న నీటిని వినియోగించుకునే అవకాశం వుందని,హెడ్ రెగ్యులేటర్ వద్ద మొరాయిస్తున్న గేట్లకు మరమత్తులు నిర్వహించాలని కోరారు. కండలేరుజళాశయం ముంపు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను వెంటనే కల్పించాలని,అర్హత కలిగిన వారు అంగీకరిస్తేవారికి నష్టపరిహారం అందించాలని ,ఉద్యోగాల కల్పనకు 150 సంవత్సరాలు పట్టే అవకాశం వున్నందున ముంపువాసులతో ప్రభుత్వం చర్చించి వారికి న్యాయం చేయాలని ఆయన డ్యామ్ అధికారులను కోరారు.ఈయన వెంటనాయకులు గాలి అంకబాబు, ఆనంద్ రెడ్డి, సురేంద్ర రెడ్డి, గణపతి, ఓజిలి సుధాకర్,నరాల సుబ్బా రెడ్డి, ప్రశాంత్‌కుమార్, ధనుంజయ,అడిటర్ లక్ష్మణ రావు తదితరులున్నారు.

## నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షులు సంధిరెడ్డి రామారావు



**ఉదయగిరి,జూన్25,ప్రభాతవార్త :** వైసీపీ ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ నాయకులను,కార్యకర్తలను వివిధ రకాలుగా తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ లీగల్‌సెల్ సభ్యులు అండగా ఉంటూ ఎటువంటి సమస్య వచ్చినా రాత్రింబవళ్లు తేడా లేకుండా కృషి చేశారని తెలిపారు.అందువల్ల రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు చేపడుతున్న నామినేటెడ్ పదవుల్లో న్యాయవాధ విభాగానికి సముచిత స్థానం కల్పించాలని ఉదయగిరి నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షులు సంధిరెడ్డి రామారావు కోరారు.వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి తెలుగుదేశం పార్టీ నాయకులను,కార్యకర్తలను వేధించడమే లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.చాలామంది నాయకులు ప్రతిపక్షంలో సైతం కార్యకర్తలకు న్యాయం చేయాలని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారులపై ఒత్తిడి తేవడంతో అప్పటి వైసీపీ నాయకులు అక్రమ కేసులు బనాయించడం,ధౌర్జన్యాలకు దిగటం తదితర విధాలుగా వేధించడం జరిగిందని గుర్తుచేశారు.వేధింపులకు గురైన కూటమి నేతలకు కార్యకర్తలకు రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో లీగల్ సెల్ అందుబాటులో ఉంటూ కృషి చేసింది.అందువలన లీగల్ సెల్‌కు ప్రాధాన్యత కల్పించాలన్నారు.

## ఏసిబికి చిక్కిన లంచావతారం



**నెల్లూరు క్రైం, జూన్ 25, ప్రభాతవార్త :** ప్రభుత్వ జీతం తీసుకుంటూ ప్రజలకు అవసరమైన పనులు చేసి పెట్టాల్సిన ఓ ప్రభుత్వ ఉద్యోగి లంచం కోరి అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కిన సంఘటన మంగళవారం నెల్లూరు నగరంలో చోటు చేసుకుంది. ఏసీబీ అధికారులు తెలిపిన సమాచారం మేరకు నగరానికి చెందిన హరిప్రసాద్ అనే వ్యక్తి వ్యవసాయ మోటార్ కనెక్షన్ కోసం స్థానిక అంబాపురంలోని ట్రాన్స్కో కార్యాలయంలో ఏఈగా పనిచేస్తున్న శివశంకరయ్యను బాధితుడ్ని రూ. 80 వేలు లంచం కోరారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని హరిప్రసాద్ ఏసిబి అధికారులను సంప్రదించగా వారి సూచనల మేరకు మంగళవారం కార్యాలయంలో శివశంకరయ్యకు రూ. 50 వేలు ఇస్తుండగా ఏసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితునికి రసాయన పరీక్ష నిర్వహించి లంచం తీసుకున్నట్లు నిర్ధారించుకున్న అధికారులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కార్యాలయంలోని పలు దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఏసిబి డిఎస్పి శిరీష, సిఐలు ఆంజనేయ రెడ్డి, శ్రీనివాస కిరణ్, విజయ్ కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అడ్డగోలుగా అనుమతులిచ్చిన అధికారులే ఆక్రమణలు తొలగిస్తున్నామంటూ చెప్పడం విడ్డూరం



**బిట్రగుంట, జూన్ 25 ప్రభాతవార్త :** బోగోలు మండల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గతంలో అడ్డగోలుగా నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి నేడు ప్రభుత్వం మారడంతో ఆక్రమణలు తొలగిస్తున్నామని చెప్పడం విడ్డూరంగా వుందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో మండలంలోని కోవూరుపల్లి ఇరిగేషన్ చెరువు చుట్టు ఇబ్బడిముబ్బడిగా ఆక్రమణలు చేసినా ప్రస్తుతం వున్న అధికారులు చోద్యం చూస్తూ ప్రేక్షక పాత్ర వహించారు. అదే అధికారులు నేడు ప్రభుత్వం మారడంతో అక్రమ కట్టడాలంటూ జెసిబితో కూల్చివేతలు ప్రారంభించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. గత రెండు రోజుల నుంచి కోవూరుపల్లి ఇరిగేషన్ చెరువుని కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు రియల్ ఎస్టేట్ కోసం వేసిన వెంచర్లలో చెరువను ఆక్రమించి ప్రహరీ గోడను చేపట్టారు. అప్పుడు చోద్యం చూసిన అధికారులు ఈ విషయంపై విమర్శలు వచ్చినప్పటికీ మౌనం వహించి నేడు జెసిబితో కూల్చివేతలు ప్రారంభించారు. కోవూరుపల్లి చెరువు ఆక్రమణలకు గురైందని దీనివల్ల ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా వారు గగ్గోలు పెడుతున్నా కదలని అధికారయంత్రాంగం గత రెండు రోజుల నుంచి ఆక్రమణలు తొలగిస్తూ చెరువు ఆయకట్టు కొలతలు వేసి హద్దు రాళ్ళను ఏర్పాటు చేస్తుండటం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండలంలో పలు ప్రధాన చెరువులలో కూడా ఈ ఆక్రమణలు తొలగించి అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరగకుండా సాగునీటి వనరులను అభివృద్ధి చేయాలని మండల రైతాంగం కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డికి విజ్ఞప్తి చేస్తుంది.

## తిప్ప వద్ద త్రుటిలో తప్పిన ప్రమాదం



**బిట్రగుంట, జూన్ 25 ప్రభాతవార్త :** బోగోలు మండలం కప్పరాళ్ళతిప్ప గురుకుల పాఠశాల సమీపంలో కావలి నుండి నెల్లూరు వైపు వెళ్తున్న కారు వెనుక టైరు పేలడంతో డివైడర్ని గుద్దుకొని నిలిచిపోయింది. దీంతో కారు ముందు భాగం మాత్రం పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. అయితే ఈ ప్రమాదంలో కారులోని ఎవరికి గాయాలు కాలేదని ప్రాణాపాయం తప్పిందని పోలీసులు తెలిపారు.

## రైల్ రోకోలు, ఆందోళనలు చేపట్టడం చట్టరీత్యా నేరం



**బిట్రగుంట, జూన్ 25 ప్రభాతవార్త :** బిట్రగుంట రైల్వే అభివృద్ధి కోసం, రిజర్వేషన్ కౌంటర్ పునరుద్ధరణ, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ళ నిలుపుదల కోసం ఆందోళన చేపట్టడం కానీ, రైల్ రోకోలు నిర్వహించడం కానీ చట్టరీత్యా తీవ్ర నేరాలుగా పరిగణించబడతాయని ఆర్‌పిఎఫ్, జీఆర్‌పి పోలీస్ అధికారులు హెచ్చరించారు. బిట్రగుంటలో మంగళవారం రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులకు రైల్వే చట్టాలు గురించి అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఎస్.కె.నూరుద్దీన్ మాట్లాడుతూ బిట్రగుంట రైల్వే అభివృద్ధి కోసం, మౌళిక సదుపాయాల కోసం తాము ఆందోళన చేపడుతున్నామని ఈ విషయంలో మీరే ఉన్నతాధికారులకు తెలియజేసి ప్రజా ఉద్యమంగా రూపొందే లోగా సమస్యలను పరిష్కరించాలని వారిని కోరారు. లేనిపక్షంలో తాము ఎంతటి త్యాగాలకైనా సిద్ధమని ఆందోళనను ఉపసంహరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అభివృద్ధి కమిటీ నాయకులు బత్తుల రవిచంద్ర, చల్లా నరహరి, ఎ.కె.భాగ్యరాజ్, వ్యాపార సంఘ నాయకులు శశికుమార్, మండల బిజెపి అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు, మండల సిపియం పార్టీ కార్యదర్శి తుమ్మల వెంకయ్య, కాంగ్రెస్ పార్టీ నేత ఎస్.కె.జహీర్, మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా స్వర్ణలత, సలీంబేగ్




**కావలి రూరల్, జూన్ 25 ప్రభాతవార్త :** కావలి రోటరీ క్లబ్ అధ్యక్షులుగా జనవిజ్ఞాన వేదిక కావలి పట్టణ శాఖ సభ్యురాలు, యోగా గురువు ఎస్.స్వర్ణలత, కార్యదర్శిగా వాయిస్ ఆఫ్ ముస్లిం మైనార్టీస్ అధ్యక్షులు, జెవివి సభ్యులు మొగల్ సలీంబేగ్‌లు బాధ్యతలు స్వీకరించారు. కావలి వెంగళరావునగర్‌లోని రోటరీ క్లబ్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి రోటరీ క్లబ్ జిల్లా బాధ్యులు డాక్టర్ కె.మాధవరెడ్డి అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథి పి.కేశవరెడ్డి నేతృత్వంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యఅతిథులుగా బి.సురేంద్రరెడ్డి, వి.నాగసతీష్‌బాబులు పాల్గొని రోటరీ క్లబ్ విశిష్టతను, చేసిన కార్యక్రమాలు గురించి తెలియజేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ స్వర్ణలత, మొగల్ సలీంబేగ్‌లు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో ఎల్లవేళలా ముందుంటారన్నారు. కావలి రోటరీ క్లబ్‌కు మంచిపేరు ప్రతిష్టలు తేవాలన్నారు. ఎంతో సేవ చేసే వారిని రోటరీ క్లబ్‌కు అధ్యక్ష, కార్యదర్శులుగా నియమించడం చాలా సంతోషంగా వుందన్నారు. అనంతరం స్వర్ణలతను, మొగల్ సలీంబేగ్‌లను దుశ్శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ బాధ్యులు డాక్టర్ బెజవాడ రవికుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు, రోహిణి ఆక్వా నీడ్స్ అధినేత వేలూరు జయచంద్రనాయుడు, యం.వెంకటేశ్వర్‌రెడ్డి, మక్కి వెంకట సుబ్బయ్య, కొండలరావు, బచ్చు వీరాస్వామి, డాక్టర్ ఆనంద్, వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షులు షేక్ ఖాదర్‌బాషా, సర్దార్ కిర్మాణి, మొగల్ రహీంబేగ్, కావలి శాఖ జెవివి అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, జిల్లా నాయకురాలు కళ్యాణి, విశ్రాంత అధ్యాపకులు ప్రసాదరావు, గోపీకృష్ణ, రోటరీ క్లబ్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కోట బలరామిరెడ్డి మృతి తీరని లోటు



**బిట్రగుంట, జూన్ 25 ప్రభాతవార్త :** బోగోలు మండలం సిఆర్‌పాళెం టిడిపి నేత కోట బలరామిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని సిఆర్‌పాళెంలో మంగళవారం బలరామిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి కావ్య కృష్ణారెడ్డి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట మండల టిడిపి కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, టిడిపి నేతలు కోట వెంకటరెడ్డి, అన్నంగి ఆదిశేషయ్య తదితరులు వున్నారు.

## ఐటిడిఏ పిఓని సస్పెండ్ చేయాలి



**నెల్లూరు, జూన్ 25, ప్రభాతవార్త – వైద్యం :** మామూళ్ళ మత్తులో గిరిజన విద్యార్థుల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసిన ఐటిడిఏ పిఓని సస్పెండ్ చేయాలని, ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర యానాది సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసి పెంచలయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డయేరియా బాధిత విద్యార్థులను పరామర్శించారు. మంగళవారం నగరంలోని దుర్గా మిట్టలో ఉన్న సర్వజన ప్రభుత్వ పెద్ద ఆసుపత్రిలో యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెసి పెంచలయ్య తిరుపతి జిల్లా చెన్నూరు ప్రభుత్వ గిరిజన బాలుర హాస్టల్ నందు 21 మంది విద్యార్థులు డయేరియా వ్యాధితో బాధపడుతూ నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి నందు చికిత్స పొందుతూ ఉండటంతో వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్లతో ఆయన మాట్లాడుతూ పేద గిరిజన విద్యార్థులకు సరైన వైద్య సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆసుపత్రి సూపరింటెండెంట్ వారానికి మూడు రోజులే ఇక్కడ పని చేయడం వల్ల రోగులు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వం దీనిపై స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మానికల మురళీ, ప్రధాన కార్యదర్శి మాకాని రవీంద్రబాబు, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, రాష్ట్ర ఉపాధ్యక్షులు తలపల చంద్రమౌళి, తిరుపతి జిల్లా అధ్యక్షులు తలపల మల్లికార్జున, ఇండ్ల మల్లి, ప్రభావతి, పోలయ్య, విజయమ్మ, మహేంద్ర, బాలసుబ్రమణ్యం, యానాది సంక్షేమ సంఘం కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## డయేరియా వ్యాధి పై ప్రజలకు అవగాహన కార్యక్రమం



**పొదలకూరు, జూన్ 25, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నేడు డయేరియా అనగా వాంతులతో పాటు నీళ్ల విరేచనాలు అను వ్యాధిపై ఎమ్మార్వో కాలనీలో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలందరూ కూడా ఈ వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీరు తాగవలసినదిగా తెలియజేసి, వేడివేడి ఆహార పదార్థాలు మాత్రం బుజించాలని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు భుజించరాదని తెలియజేసారు. ఎవరికైనా వాంతులు విరోచనాలు ఉన్నట్లయితే, వెంటనే ఆశా కార్యకర్తలకు లేదా వైద్య సిబ్బందికి తెలియజేయాలని అందరికీ విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులకు ఎం.రాధా కుమారి, సాని శివ ప్రసాద్, మిడ్లేవల్ హెల్త్ ప్రొవైడర్ టి. సుమాంజలి, ఆశా కార్యకర్తలు, సీత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉలవపాడు మండలంలో అడ్డుఅదుపు లేకుండా రేషన్ బియ్యం మాఫియా



**ఉలవపాడు, జూన్ 25, ప్రభాతవార్త :** కందుకూరు నియోజకవర్గంలో అక్రమ రేషన్ బియ్యం మాఫియా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. ఏ పార్టీ వచ్చినా అంతా మా ఇష్టమే అంటూ రేషన్ మాఫియా దళారులు మాట్లాడుతున్న సమాచారం. మాఫియా ఏ పార్టీ అధికారంలో ఉన్న సిండికేట్ అయ్యి అధికారులకు తాయిలాలు ఇస్తూ తమ పని కానిస్తున్నారని ప్రజలు అనుకుంటున్నారు. మరి ఏ పార్టీ వచ్చిన అనేకంటే గత ప్రభుత్వంలో ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రేషన్ మాఫియా ఇష్టారాజ్యమైంది. రేషన్ బియ్యాన్ని అడ్డగోలుగా కొనుగోలు చేసి అక్రమంగా అమ్ముతుంటే స్థానిక అధికారులు ఏం చేస్తున్నారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అదే తంతు ఎప్పటికి కొనసాగుతుందని ప్రజలు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని అధికారులపై మండిపడుతున్నారు. ఉలవపాడు మండలంలోని మిల్లులో బియ్యం రిసైకిల్ చేసి ఆ తరువాత డంప్ చేసి లారీ ద్వారా లోడ్ చేసి రేషన్ బియ్యం తరలి వెళ్తున్నప్పటికి కూడా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు దారి తీస్తుంది. ఇప్పటికైనా అక్రమ రేషన్ బియ్యానికి ఉలవపాడు మండల పరిధిలో అడ్డుకట్ట వేయాలని పేదవాడి బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## పక్షవాతంతో బాధపడుతున్న బాదుల్లాకు 20 వేలు ఆర్థిక సాయం



**కావలి రూరల్, జూన్ 25 ప్రభాతవార్త :** కావలి పట్టణ 23వ వార్డుకు చెందిన షేక్ బాదుల్లా పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితం కావడంతో హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషా తన స్నేహితుల సహకారంతో 20 వేల రూపాయలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఘనీబాషా మాట్లాడుతూ తన బాల్య మిత్రుడు షేక్ బాదుల్లా ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవారన్నారు. కొద్దికాలం క్రితం హైబిపి వల్ల పక్షవాతం వచ్చి కుడి కాలు, కుడి చేయి, నోరు పడిపోయి మంచానికే పరిమితమయ్యాడని తెలిపారు. రెక్కాడితే కాని డొక్కాడని ఆ కుటుంబం పూట గడవడం కూడా కష్టతరంగా మారిందన్నారు. దీంతో తోటి స్నేహితులు మేము వున్నామంటూ ముందుకు వచ్చి 20 వేల రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగిందన్నారు. స్నేహితులు ఒక్కో సారి ఒక్కో విధంగా సహాయం చేస్తున్నారని వారందరికి ధన్యవాదాలు తెలిపారు. రోజుల్లో కూడా బాదుల్లా కుటుంబానికి అండగా వుంటామని తెలిపారు. బాధితుడు బాదుల్లా తండ్రి ఖాసిం, హ్యాపీ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## దగదర్తి గ్రామంలో నేను బడికి పోతాపై ర్యాలీ



**దగదర్తి, జూన్ 25 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన దగదర్తి గ్రామంలో మంగళవారం దగదర్తి జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులచే నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దగదర్తి హ్యాబిటేషన్ పరిధిలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా నిలబడి నేను బడికి పోతా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. బడిలో చేరి ఆగిపోయిన విద్యార్థులు తిరిగి బడిలో చేర్పించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిరిపురంలో నేను బడికి పోతా కార్యక్రమం



**కావలి రూరల్, జూన్ 25 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం సిరిపురం మండల ప్రజాపరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో సిరిపురం గ్రామంలో మంగళవారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. నేను బడికి పోతా అంటూ విద్యార్థులు ఫ్లెకార్లు చేతబట్టి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కావలి మండల విద్యాశాఖాధికారులు బి.గోవిందయ్య, సి.హెచ్.వెంకట సుబ్బయ్య, ప్రధానోపాధ్యాయరాలు టి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, సిఆర్‌యంటి వెంకట్రావులు పాల్గొన్నారు. పాఠశాలలో చదువుపై చిత్రలేఖనం, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

## అక్రమణలకు అడ్డుకట్ట వేసిన అధికారులు

**పొదలకూరు, జూన్ 25, ప్రభాతవార్త :** పొదలకూరు పట్టణంలో స్థానిక తొగట వీధిలో సత్యనారాయణ లే అవుట్‌లో పబ్లిక్ అవసరాల నిమిత్తం పార్క్‌కి చెందిన స్థలంను కొంతమంది వైసిపి నేతలు ఆక్రమించుకొని ప్లాట్‌గా చేసి అమ్మకాలు చేయాలని చూశారు. కానీ టిడిపి నాయకులు ఈ విషయమై ప్రశ్నించగా సంబంధిత స్థలంలో అధికారులు ప్రస్తుతం బోర్డ్ వేశారు. అక్రమార్కులకు అధికారులు అడ్డుకట్ట వేసేలా టిడిపి నాయకులు కృషి చేసిన పనితీరుకు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఎంఎల్ఏ కాకర్లకు అపూర్వస్వాగతం



**జలదంకి, జూన్25, ప్రభాతవార్త :** సార్వత్రిక ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గంనుంచి ఘనవిజయం సాధించి ఎంఎల్ఏగ ప్రమాణ స్వీకారంచేసి తొలిసారిగ మంగళవారం జలదంకి విచ్చేసిన కాకర్ల సురేష్‌కు కనీవినీ ఎరుగని రీతితో అపూర్వస్వాగతం అభించింది. మండల నలుమూలలనుంచి అశేషంగ విచ్చేసిన కూట మి నాయకులు, కార్యకర్తలు అభిమానులతో జనసంద్రాన్ని తలపించింది. జమ్మలపాళెంలో మధ్యాహ్నంనుంచే తమ అభిమాన నాయకుడిరాకకోసం జనం ఎదురుచూపులు చూడసాగారు. ముఖ్యనాయకులు బారీ పూలమా లలు, బొకేలు చేబూని కాకర్ల కోసం సందడిచేశారు. స్థానిక నాయకుడు నక్కామాధవరావు ఎంఎల్ఏకోసం చేసిన హంగామా అంతా, ఇంతాకాదు. బారీ వేదికలు ఏర్పాటుచేసి పచ్చజండాల రెపరెపలమధ్య స్వాగత ఏర్పాట్లు చేసిన తీరు అద్భుతమని చెప్పాలి. వేదికమీదకు కాకర్ల రాగానే జనం ఆయనచూసేందుకు ఎగబడ్డారు. నాయకులు కార్యకర్తల నినాదాలమధ్య అందరికి అభివాదంచేసి ఆయన ముందుకు కదిలారు. అడుగ దుగున డిజెసౌండ్సు, బాణాసంచాపేలుళ్ళు, డప్పు వాయిద్యాలమధ్య జమ్మలపాళెం బస్టాండ్ సెంటర్‌లో అందరికి అభివాదంచేసి ఎంఎల్ఏ ర్యాలి సాగింది. ఎల్ఆర్అగ్రహారం రోడ్, జలదంకి గట్టుపల్లి సెంటర్ కూడలిలలో ఆయాగ్రామాల పార్టీ అభిమానులు కదంతొక్కారు. ఎంఎల్ఏ కాకర్లను దుశ్శాలువాలతో సన్మానించడంలో పోటీప డ్డారు. అందరికి కృతజ్ఞతాపూర్వక అభివాదాలు తెలిపారు. అనంతరం జలదంకి బస్టాండ్‌సెంటర్‌లో బారీ ఫ్లెక్సీల స్వాగతం, పూలవర్షంతో కార్యకర్తలు సందడిచేయడం చూపరులను ఎంతో ఆకట్టుకుంది. పలువురు అభిమానులు సాలువాలతో సన్మానించడం సెల్ఫీలు దిగడం ఒక ఎత్తైతేయాదవరాజులు గొర్రెపల్లను అందజేసి తమ సాంప్రదాయాన్ని చాటుకోవడం విశేషం. అనంతరం అందరిని ఉద్దేశించి కాకర్ల సురేష్ మాట్లా డారు. జలదంకి మండల ప్రజల రుణంఎప్పటికి మరువరానిదని, మీరుణం తీర్చుకోలేనిదని అన్నారు. కూటమి ఘన విజయం వెనుక ప్రతీ కార్యకర్త విశేషకృషి దాగివుందని తెలిపారు. మీవెనుకాల కాకర్ల ఎపుడు వుంటాడు అందరి ఋణం తీర్చుకుంటానని హర్షధ్వానాలమధ్య ప్రకటించాడు. ప్రతిగ్రామం తిరుగుతా, అందరినీ పలకరిస్తా, సమస్యలపై దృష్టిపెడతానన్నారు. ముఖ్యంగ కావలి కాలువ, సోమశిల జలాలు ప్రతి ఎకరాకి సాగునీరందించడం తన ప్రథమ కర్తవ్యమన్నారు. జలదంకి సెంటర్‌నుంచి ర్యాలి గ్రామ శివార్లకు చేరుకునేందుకు దాదాపు గంటకు పైగా సమయం పట్టిందంటే అభి. మానులు ఉత్సాహం ఏవిదంగ వుందో ఇట్టే అర్ధమైంది. అనంతరం 9వమైలు, 11వమైలు, చినక్రాక, 14వమైలు గ్రామాలలో అదే ఆదరాభిమానాలతో ఆయా గ్రామాల ప్రజలు స్వాగతం పలకడం వేశేషం. కాకర్ల ఎపుడైతే జలదంకిలో అడిగినాడో సరిగ్గ అపుడే చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. ఈపరిణామం జనాన్ని ఎంతో పులకింపజేసింది. వరుణదేవుడుకూడా తమ సంతోషాన్ని వ్యక్తంచేస్తు జల్లులు కురిపించి స్వాగతం పలికాడని అందరు ఆనందించడం కొసమెరుపు. మండలపార్టీ అధ్యక్షుడు పులిగుంట మధురెడ్డి వంటేరు జయచంద్రారెడ్డి, పూనూరు భాస్కర్‌రెడ్డి, తల్లపనేని మదునాయుడు నేతలతోపాటు కూటమి నాయకగణం పాల్గొన్నారు.

## ఇచ్చిన లక్ష్యాలు నూరుశాతం పూర్తికావాలి



**కోవూరు, జూన్ 25 ప్రభాతవార్త :** కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలోని రెండు మండలాలకు సంబంధించిన పశు సహాయకులు వారికి ఇచ్చిన లక్ష్యాలను నూరుశాతం పూర్తిచేసేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య అన్నారు. కోవూరులోని శాంతినగర్ లో ఉన్న పశు వైద్యశాల సమావేశ మందిరంలో సోమవారం రెండు మండలాలకు సంబంధించిన పశు వైద్యులు, పశు సహాయకులు గోపాలమిత్రలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రస్తుతం ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచాల్సి న అవసరం ఎంతైనా ఉం దన్నారు. ముఖ్యంగా కృత్రిమ గర్భధారణపై పాడి రైతుల్లో పూర్తిస్థాయిలో అవగాహన పెంచి మేలు జాతి పశు ఉత్పత్తిపై తగు చొరవ తీసుకోవాల్సి న అవసరం ఉందన్నారు. పశు సహాయకుల వారీగా సమీక్షించారు. ఈ సమీక్షలో పశు వైద్యులు డాక్టర్ ప్రీతి సాల్మన్, డాక్టర్ షబానా, వెటర్నరీ అసిస్టెంట్ సజ్జాద్ అహ్మద్, తదితరులు ఉన్నారు.

## సేంద్రియ వ్యవసాయం లాభదాయకం




**కోవూరు, జూన్ 25 ప్రభాతవార్త :** ప్రస్తుతం వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన మార్పులపై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవడమే కాకుండా సేంద్రియ వ్యవసాయంపై రైతు లు దృష్టి పెట్టాల్సి న అవసరం ఉందని సినార్డ్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు జేపీ జవహర్ పేర్కొ న్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సినార్డ్ సంస్థ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో సేంద్రియ వ్యవసాయంలో చేసిన ఉత్పత్తులపై వినియోగదారుల్లో ప్రత్యేక దృష్టి ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు సేంద్రియ వ్యవసాయంపై దఋష్టి పెట్టాలన్నారు. ప్రాజెక్టు మేనేజర్ ప్రవళిక మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతులు తమ సాగు ఖర్చులను ఘననీయంగా తగ్గించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు కూడా పొందేందుకు సేంద్రియ వ్యవసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏపీవో టి. సుబ్బారావు పండ్ల తోటల పెంపకంపై మహిళా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్గనైజర్ పద్మావతి, లక్ష్మి, సంఘమిత్ర అధ్యక్షురాలు సుగుణమ్మ, కోశాధికారి ధనమ్మ, తదితరులు ఉన్నారు.

## మంత్రి ఆనంను కలిసిన మాజీ ఎంపిటిసి సభ్యులు షబ్బీర్‌బాషా



**అనుమసముద్రంపేట, జూన్25, ప్రభాతవార్త :** రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో ఏఎస్‌పేట మాజీ ఎంపిటిసి సభ్యులు షేక్ షబ్బీర్‌బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల అనంతరం మంత్రి హోదాలో నెల్లూరుకి వచ్చిన ఆనం రామనారా యణరెడ్డిని ఏఎస్‌పేట నాయకులు కలిశారు. పుష్పగుచ్ఛం, శాలువాలతో సత్కరించారు. ప్రత్యే క అభినందనలు తెలిపారు. మండలం లోని కొన్ని విషయాలపై చర్చించారు. ఈకార్యక్రమంలో ఆయనతోపాటు పలువు రు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవం




**నెల్లూరు, జూన్ 25, ప్రభాతవార్త – వైద్యం :** నగరంలోని రామ్మూర్తి నగర్‌లో ఉన్న జిల్లా బిజేపి కేంద్ర కార్యాలయంలో ఎమర్జెన్సీ కాలంలో జైళ్ళ పాలైన అనేక మంది ఆనాటి జన సంఘం నాయకులకు సన్మాన సభని బిజేపి జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా బిజేపి జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్ రెడ్డి మాట్లాడుతూ అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఏకపక్షంగా అత్యవసర స్థితిని విధించిన 1975 – 77 మధ్యకాలంలో 21 నెలల కాలాన్ని భారత అత్యవసర స్థితి లేదా ఎమర్జెన్సీగా వ్యవహరించారన్నారు. భారత రాజ్యాంగంలోని 352 (1), అధికారనంలో అంతర్గత కల్లోల స్థితిని వినియోగించుకుని అప్పటి ప్రెసిడెంట్ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ద్వారా 1975 జూన్ 25 అర్ధరాత్రి 11.45 నిమిషాలకు అధికారికంగా విధింపజేశారు. 1977 మార్చి 21లో ఉప సంహరించే వరకు కొనసాగింది. ఆదేశాల ద్వారా పరిపాలిస్తూ ఎన్నికలను నిలిపివేసి పౌరహక్కులు అడ్డుకుని అధికారాన్ని ప్రధాన మంత్రికి ఈ ఆర్డర్ అందించింది. ఎమర్జెన్సీలో ప్రధానంలో ఇందిరా గాంధీ రాజకీయ ప్రత్యర్థులను జైలుపాలు చేసి, పత్రికలను సెన్సార్ చేశారు. ప్రధాన మంత్రి కుమారుడు సంజయ్ గాంధీ ముందుండి నడిపిన సామూహిక గర్భ నివారణ కార్యక్రమం వంటి ఇతర దురాగతులు కూడా నివేదితం అయ్యాయి. స్వతంత్రం భారత దేశ చరిత్రలో అత్యంత వివాదాస్పదమైన కాలంలో ఎమర్జెన్సీ ఒకటని అన్నారు. అనంతరం పలువురు బిజెపి సీనియర్ నాయకులు, ఆనాటి జన సంఘం నాయకులు మాట్లాడుతూ నాటి స్మృతులను కష్టనష్టాలను గుర్తు చేసుకుని నేటి నాయకులు, కార్యకర్తలు ఎలా పనిచేయాలో పార్టీని ఎలా అభివృద్ధి చేయాలో సమాజానికి దేశానికి ఎలా ఉపయోగపడాలో అభివర్ణించారు. అనంతరం దివంగత బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జి రెడ్డి సంతాప సభ నిర్వహించారు. పై సభలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన పార్టీకి చేసిన సేవలను గురించి పలువురు నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు దువ్వూరు రాధాకృష్ణ రెడ్డి, సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, పి. సురేందర్ రెడ్డి, కె. ఆంజనేయ రెడ్డి, కందికట్ల రాజేశ్వరమ్మ, జి. భరత్ కుమార్, యశ్వంత్ సింగ్, ముక్కు రాధాకృష్ణ గౌడ్, గడ్డం విజయకుమార్, ఎరబోలు రాజేష్, అశోక్ నాయుడు, ఫణి రాజు, కరణం సుభాషిని, ఇతర బిజెపి అనుబంధ సంఘ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ఘన స్వాగతం



**కలిగిరి ,జూన్25, ప్రభాతవార్త;**ఉదయగిరి శాసన సభ్యులుగా అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసి మొదటి సారిగా కలిగిరి మండలానికి వచ్చిన ఎమ్మెల్యే కాకర్లసురేష్‌కు కలిగిరి మండల నాయకులు, కార్యకర్తలు అభిమానులనుంచి ఘన స్వాగతం లభించింది. తెలుగుదేశంపార్టీ తరపున ఉదయగిరి నియోజకవర్గంలో గెలిసిన కాకర్ల ఇటీవల అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఉదయగిరి నియోజ కవర్గానికి మంగళవారం బయలుదేరిన సురేష్ కలిగిరి మండలంలోని 14వ మైలు సెంటరు వద్ద నాయకులు అభిమానులు కాకర్లకు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ఈసందర్బంగా గజమాలతో సత్కరించి బాణసంచా కాల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు.అనంతరం స్వీట్లుపంచుకున్నారు.అయ్యపరెడ్డిపాళెం, పెద్దకొం డూరు, పెద్దపాడు, వీరారెడ్డిపాళెం, పోలంపాడు అబానులు కాకర్లకు స్వాగతం పలికారు. మండల కేంద్రమైన కలిగిరిలో టిడిపినాయకులతో కలిగిరి కిక్కిరిసి పోయింది. ఈ సందర్బంగా సురేష్ మాట్లాడుతూ మీ అభి మానం వెలకట్టలేనిదని తనకు ఇంతటిగౌరవాన్ని , ఇంతపెద్దపదవిని అందిచిన ప్రజలకు అబిమానులకు ఈ 5సంవత్సరాలు సేవచేసుకొనే భాగ్యం కల్పించిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానన్నారు.ప్రజలకు అందు బాటులో ఉంటూ ప్రభుత్వపథకాలు ప్రతి ఒక్కరికీ చేరేవిధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మెట్టుకూరి చిరంజీవిరెడ్డి, బిజ్జం క్రిష్ణారెడ్డి,సిహెచ్ సుబ్బారెడ్డి బొల్లినేని వెంకట రామారావు, గొట్టిపాటిలింగారావు,మల్నేని శ్రీనివాసులనాయుడు, అయ్యపరెడ్డిపాళెం శ్రీనివాసులు నాయుడు,చీమల తాతయ్య,పూసాల వెంగపనాయుడు, కాకు మహేష్, మెక్కా హజరత్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఆనంని మర్యాదపూర్వకంగా కలిసిన జేసి



**నెల్లూరు, జూన్ 25, ప్రభాతవార్త - వైద్యం :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం నెల్లూరుకి విచ్చేసిన ఆనం రామనారాయణ రెడ్డిని, మంగళవారం నగరంలోని సంతపేటలో ఉన్న రామ నారాయణ రెడ్డి నివాసంలో ఆయనని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం



**నెల్లూరు, జూన్ 25, ప్రభాతవార్త - వైద్యం :** లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని అందుకు విరుద్ధంగా నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మల్లి పెంచలయ్య హెచ్చరించారు. మంగళవారం నగరంలోని సంతపేటలో ఉన్న డిఎంహెచ్ఓ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో పెంచలయ్య అధ్యక్షతన జిల్లా స్థాయి సలహా సంఘం (పిసి, పిఎన్‌పిటి, ఎఆర్టి) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టాలకు లోబడి స్కానింగ్ కేంద్రాలు, ఆర్ట్ క్లినిక్‌ను నిర్వహించుకోవాలని, చట్టాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆకస్మికంగా తనిఖీ, డెకాయ్ ఆపరేషన్స్ చేపడతామన్నారు. స్కానింగ్ కేంద్రాల నిర్వహకులు తప్పని సరిగా ఫారం ఎఫ్‌ని ఆన్లైన్ చేసుకోవాలని సూచించారు. సరోగసి ద్వారా సంతానం పొందేందుకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించారు. ఈ సమావేశంలో హెచ్ఓడి డాక్టర్ కిరణ్, గైనకాలజిస్టు డాక్టర్ లక్ష్మి, పిడియాట్రిషియన్ పిసి, పిఎన్‌డిటి ప్రోగ్రాం అధికారులు, బి. శ్రీనివాసరావు డెమో కె. కనకరత్నం, అదనపు డెమో పి. వినోద్ కుమార్, పిఆర్ఓ కె కుసుమ కుమారి, ఎన్డీవో తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామిని దర్శించుకున్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సతీమణి జ్యోతమ్మ



పొదలకూరు, జూన్ 25, ప్రభాతవార్త : పొదలకూరు పట్టణంలోని మారుతీనగర్‌లోని శ్రీ వీర అభయాంజనేయ స్వామి దేవస్థానంలో నాలుగవ మంగళవారం రెడ్డి జనసేవా సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వ హించారు. ఈ పూజా కార్యక్రమంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి సతీమణి జ్యోతమ్మ పాల్గొని ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభగిరి పట్నంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం, శివాలయంలోనూ పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు.

## పేపర్ లీక్ ఘనటలో నిందితులను కఠినంగా శిక్షించాలి



నెల్లూరు,జూన్25 ప్రభాతవార్త-విద్య నీట్(యూజీ) పేపర్ లీక్ ఘటనలో నిందితులను కఠికంగా శిక్షించాలని, అలాగేపరీక్షలు రాసిన లక్షలమంది విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కచ్చితమైన బరోసాను కల్పించాలని ఏసీఎస్ఆర్ వైద్యశాల ప్రొఫెసర్ డాక్టర్ కాలేషా పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని స్థానిక జెట్టిశేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పేపర్ లీక్ పై చర్చావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన అధ్యక్ష్యత వహించి మాట్లాడారు. పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు తీవ్ర మైన నిరాశలో ఉన్నారని, కేంద్ర నీట్ ను రద్దుచేసేందుకు సిద్దంగా లేదని, సుప్రీం కోర్టు కౌన్సిలింగ్ నిర్వహణ నిలుపుదల చేసేందుకు సిద్దంగా లేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మరో రెండు నెలల్లో విద్యార్థులను నీట్‌కు సిద్దం చేయ్యాల్సిన అవసరం ఉందన్నారు. నిందితునలు శిక్షించి భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దక్టార్ ఎండి.రఫి, డాక్టర్ శ్రీనునాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ డిఎంఅండ్ హెచ్ఓ



**సంగం జూన్ 25 ప్రభాతవార్త** సంగం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఖాజావలి పరిశీలించారు. వైద్యసిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డయోరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనిసూచించారు. వైద్యసిబ్బంది ప్రజలకు ప్రస్తుతం వాతావరణంలో మార్పులు వస్తున్న సందర్భంగా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.ప్రజలు కూడా కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని ఆయన సూచించారు.ఈకార్యక్రమంలో ప్రాథమిక వైద్యశాల డాక్టర్,వైద్యసిబ్బంది ఉన్నారు.

## అక్రమంగా నిర్మిస్తున్న వైకాపా కార్యాలయాలను ప్రభుత్వానికి అప్పజెప్పాలి



**నెల్లూరు,జూన్25 ప్రభాతవార్త-విద్య** పేదలకు ఇండ్ల స్థలాలు ఇస్తామని , భూములు సేకరించి అందులో విలాసవంతమైన వైకాపా కార్యాలయాలను నిర్మిచటం దారుణమని , వెంటనే ఈ అక్రమ కట్టడాలను ప్రభుత్వానికి అప్పజెప్పాలి జనసేన నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని స్థానిక వెంకటేశ్వర పురంలో సుమారు రెండు ఎకరాల స్థలంలో నిర్మాణంలో వైకాపా జిల్లా నూతన కార్యాలయాన్ని జిల్లా జనసేన నేతలు సందర్శించి ఆందోళణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు తమ పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్ ఆదేశాల మేరకు నేడు ఈ అక్రమ కట్టడాన్ని పరిశీలించటం జరిగిందన్నారు. గతంలో వైకాపా ప్రభుత్వహయాంలో పరిపాల వారు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా సాగిందన్నారు. పేదలకు కేవలం ఆరు అకంణాల స్థలాలలను ఇచ్చేందుకు ఆలోచించిన జగన్ ప్రభుత్వం ఆదే ప్రాంతంలో ఆయన కార్యాలయాలను నిర్మించుకునేందుకు వందల ఎకరాల భూములను రాష్ట్ర వ్యాప్తంగా సొంతం చేసుకోవటం జరిగిందన్నారు. రాజులు, సామంతులు, రాజరికాలు గుర్తుచేసే విధంగా ప్రభుత్వాన్ని ఎదిరించిన వారిపై రాజ ద్రోహం కేసులు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని గుర్తు చేశారు. పేద ప్రజల నివాసాల మద్య ఇంతటి భారీ కట్టడాలను అనుమతులు లేకుండా నిర్మిస్తుంటే అధికారులు చూస్తూ ఉండిపోవటం మంచి పద్దతి కాదని, ఇ అక్రమ నిర్మాణంలో వారు కూడా బాగస్వాములేనని దుయ్యబట్టారు.ఇందుకు సహకరించిన అధికారులపై కూడా కేసులు నమోదు చేయ్యాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైకాపా కార్యాలయాల నిర్మాణాలను చేపట్టే బాధ్యత జగన్ మిత్రుడైన రాంకీ సంస్థలకు అప్పజెప్పారని, దీనిని ప్రతిఫలంగా రాంకీ సంస్థకు అనకాలపల్లిలో 50ఎకరాల భూమిని అప్పనంగా కట్టబెట్టారని ఆరోపించారు. 26 జిల్లాలో సుమారు 43 ఏకరాల భూమిని కార్యాలయాల ఏర్పాటుకు కేలాయించుకున్నారని, ప్రస్తుతం వాటి విలువ 688 కోట్ల వరకు ఉంటుందని నిపుణులు అంచనా వేశారన్నారు. ఈ అక్రమ కట్టడాలపై ఉన్నతాధికారులు తక్షణం చర్యలు తీసుకుని బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, జిల్లా నాయకులు నూనెమల్లిఖార్జున యాదవ్, నాయకులు ఏటూరి రవికుమార్, కారంపూడి కృష్ణారెడ్డి, శ్రీరాం , చిరంజీవి యువత జిల్లా అధ్యక్షులు మార్కెట్ సురేష్, హరిరెడ్డి, సుధామాదవ్, భక్తవత్సలనాయుడు, శ్రీకాంత్, పవన్, హేమచంద్ర, ప్రశాంత్‌గౌడ్, మౌనేష్, చిన్న,రాజా, శ్రీను, ఇసాక్, బాలు, చిన్నరాజా తదితరులు పాల్గొన్నారు.

## పంచేంద్రీయాలపై అనర్ఘళంగా ప్రసంగించిన ఎమ్మెల్యే కావ్య





**కావలి, జూన్ 25 ప్రభాతవార్త** పంచేంద్రీయాలపై అవగాహన కల్పిస్తూ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి(కావ్య కృష్ణారెడ్డి) చేసిన ప్రసంగం బ్రహ్మకుమారిలు, బ్రహ్మకుమారులను ఎంతగానో ఆకట్టుకుంది. కావలి పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మ కుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వాహకులు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంస్థ మొట్టమొదటి కార్యనిర్వా హకు రాలు యజ్ఞమాతేశ్వరి జగదంబ సరస్వతి పుణ్య స్మృతి దినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కావ్య ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. బ్రహ్మకుమారి సంస్థ గొప్పతనాన్ని కొనియాడారు. పంచేంద్రీయాలపై అందరికి అర్ధమయ్యే రీతిలో అవగాహన కల్పించడంతో అక్కడ చప్పట్ల వర్షం కురిసింది. కావలి బ్రహ్మకుమారి బ్రాంచి ఇన్‌చార్జ్ లక్ష్మి, బ్రహ్మకుమారి భువనేశ్వరి,బాప్‌దాదా ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రొపె యిటర్ కేశవనారాయణ, విశ్వశాంతి పాఠశాల కరస్పాండెంట్ రమణయ్య, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

## నమస్కార్ సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



**కావలి, జూన్ 25 ప్రభాతవార్త** కావలి పట్టణ నమస్కార్ లాడ్జి ఎదురుగా రాము హోటల్ వద్ద ఆగివున్న ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొనడంతో ద్విచక్రవాహనం మీద వున్న రాఘవేంద్ర చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి వివరాలు వెల్లడించారు. కొల్లూరుపాడు గ్రామం నుంచి నెల్లూరు సమీపంలోని రాజుపాళెంకు ద్విచక్రవాహనంపై శివశంకర్, రాఘవేంద్ర ఇద్దరు వెళుతూ కావలి రాము హోటల్ వద్ద బండి నిలబడి ఆగారు. వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఇద్దరు కింద పడ్డారు. రాఘవేంద్ర టైరు కిందపడ్డాడు. తీవ్ర రక్తగాయాలు కావడంతో కావలిలో ప్రధమ చికిత్స అనంతరం నెల్లూరు అపోలో వైద్యశాలలో చేర్పించగా వైద్యం పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. వన్‌టౌన్ ఎస్ఐ అంబేద్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రావూస్‌లో ఎమర్జన్సీపై అవగాహన



వెంకటాచలం,జూన్25ప్రభాతవార్త వెంకటాచలంలోని రావూస్ కళాశాలలో ఎమర్జెన్సిపై అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజేపి రాష్ట అధికార ప్రతినిది కర్నాటి అంజనేయ రెడ్డి,రాష్ట వివిధ సెల్‌ఇన్‌చార్జ్ పి.సురేంద్ర రెడ్డి, వెంకటాచల మండల బిజేపి ఆధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు పాల్గోన్నారు. ఇందిరా గాంది1975 జూన్25వ తేది అర్ధరాత్రి ప్రజాసామ్య విలువలకు తిలోదకాలు ఇస్తూ అధికారాన్ని నిలుపుకోవడం కోసంఎమర్జెన్సీ విధించిందన్నారు. ఈ అత్యవసర పరిస్థితి ద్వారా ప్రజల హక్కులను కాలరాసి, ప్రతికా స్వేచ్ఛకు తిలోదకాలుఇచ్చి అంక్షలు విధించిందన్నారు. ఈ ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూన్న దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు చెందిన 4వేల మందిని అరెస్ట్ చేసి జైల్లలో పెట్టడం జరిగిందన్నారు. అలాగే 1 లక్షా 40 వేల మందికఇ పైగా ప్రజలనుఅరెస్ట్ చేసి జైళ్లకు పంపారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం 75 సార్లు రాజ్యాంగ సవరణ చేసిందన్నారు.1947 నుండి 2014 వరకు 90 సార్లు ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా ఆధ్యక్షుడు అశోక్ నాయుడు, పెద్ద ఎత్తున బిజేపి నాయకులు,విద్యార్థినీ విద్యారులు వున్నారు.

## వైభవంగా సంకటహర చతుర్థి



**కోవూరు, జూన్ 25 ప్రభాతవార్త :** కోవూరులోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో వెలసి ఉన్న శ్రీ వినాయకునికి మంగళవారం సంకటహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, భక్తులు ఉన్నారు.

## మక్తాపురం వద్ద పెన్నాపొర్లుకట్టలు పరిశీలించిన తహసిల్దారు బృందం





**సంగం జూన్ 25 ప్రభాతవార్త** సంగం మండలం మక్తాపురం నుండి ఇసుక అక్రమంగా తొలుకొని పోతు న్నారన్న విషయం తెలుసుకొని తహసిల్దారు బి.రమాదేవి ,ఎస్ఐ నాగార్జునరెడ్డి పెన్నా నదిని,పొర్లు కట్టలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె గ్రామంలో ఉన్న ట్రాక్టర్ యజమానులతో మాట్లాడారు. మీ గ్రామం నుండి కొంత మంది ఇసుక అక్రమంగా తోలుతున్నారని తెలిసింది. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అనసూయనగర్ నుండి బుచ్చిరెడ్డిపాళెంకి చెందిన కొన్ని ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందనిచెప్పారు.ఇసుక అక్రమ రవాణా ఆపాకపోతు కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. అక్రమ ఇసుక విషయం సెబ్ అధికారులకు కూడా లెటర్ పెట్టినట్లు ఆమె వివరించారు.ఈకార్యక్రమంలో విఆర్ఓ ప్రసాద్, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

## రాష్టస్థాయి అర్చరీ పోటీల్లో ప్రతిభచూపిన జిల్లా క్రీడాకారులు




**నెల్లూరు,జూన్25 ప్రభాతవార్త-విద్య** ఈనెల 22నుండి 24 వ తేదీ వరకు విజయవాడ శాతవాహన కళాశాలలో నిర్వహించిన 14వ ఎన్‌టిపిసీ మిని ఆర్చరీ చాంఫియన్ షిప్‌లో అండర్-15,13,10 విభాగాల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనపరిచి పతకాలను కైవశం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ఏసీ సుబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో విజేతలకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అర్చరీ అసోసియేషన్ అధ్యక్ష్య కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు లు ఈ సందర్బంగా మాట్లాడుతు అండర్ 15 ఇండియన్ రౌండ్‌లో ఎ.లాస్య బ్రాంజ్ మోడల్ సాధించగా రికర్వరౌండ్‌లో చాట్ల అక్షయ్ బంగారు పతకాన్ని కైవశం చేసుకున్నాడని తెలిపారు.అండర్13 విభాగం ఇండియన్ రౌండ్‌లో వై.దీత్యాచం ద్రిక ,కె.మధుసూధన్‌లు నాల్గవ స్థానాన్ని సాధించటం జరిగిందన్నారు.అలాగే రికర్వ్ విభ్యాగంలో చాట్ల అక్షయ్ బంగారు పతకాన్ని సాధించగా బి.అక్షయ్ రమణ 4వ స్థానాన్ని సాధించటం జరిగిందన్నారు. అండర్ 10 కాంఫౌండ్ విభాగంలో టిపి.గీర్వాని సిల్వర్ పతకాన్ని, మేధాసింగ్ బ్రాంజ్ పతకాన్ని సాదించారన్నారు. అలగే కె.తన్విక్ రావత్, పి.అహానాశ్రీ లు నాల్గవ స్థానాన్ని కైవశం చేసుకున్నారని వీరితో పాటూ జాతయాస్థాయి పోటీలకు అదనపు క్రీడాకారులుగా చాట్ల అశ్విన్, టి.విశ్వితారెడ్డి, కె.లోహిత్, బి.నూతన్, చితన్య, నిష్వితలను ఎంపిక చేయటం జరిగిందన్నారు. వీరు జాతీయస్థాయి పోటీల్లో కూడా మంచి విజయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చిత్రపటానికి మైనారిటీల పాలాభిషేకం



**రాపూరు,జూన్25ప్రభాతవార్త** వెంకటగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ చిత్రపటానికి మంగ ళవారం రాపూరు పట్టణానికిచెందిన మైనారిటీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. పట్టణానికి చెందిన గౌష్ భాషాకు మహత్మా గాంధీ జాతియ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా అవకాశం కల్పించి నందుకు కృతజ్ఞతగా ఈ పాలాభిషేకంనిర్వహించారు. అలాగే రాపూరులోని షాధీమంజిల్‌ను అభివృద్ధి చేయడంతో పాటు, ముస్లీం,మైనారిటీలకు వివిధఅవకాశాలను కల్పించి వారి అభ్యున్నతికి తోడ్పడాలని ఈ సందర్భంగా మైనారిటీ నాయకుడు ఎస్‌డి.ఆరీఫ్ కోరారు. గౌస్ భాషా, షపి, ముక్తియార్, లతీఫ్,బక్షు, పలువురు మైనారిటీ యువత వున్నారు.

## నేను బడికి పోతా కార్యక్రమంపై మండలస్థాయి సమీక్ష సమావేశం



**ఉదయగిరి,జూన్25,ప్రభాతవార్త** మంగళవారం ఉదయగిరి మండల అభివృద్ధి అధికారిణి ఈశ్వరమ్మ ,మండల విద్యాశాఖ అధికారి తోట శ్రీనివాసులు ఆధ్వర్యంలో నేను బడికి పోతా కార్యక్రమంపై మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానో పాధ్యా యులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని,బడి బయట ఉండకూడదని,గ్రామ సచివాలయం పరిధిలో డ్రాపౌట్స్ జాబితా తయారు చేయాలని,మండలంలో ఎలాంటి డ్రాప్‌ఔట్స్ లేకుండా,మండలస్థాయి కమిటీ పర్యవేక్షణ లో,విలేజీస్థాయి కమిటీ ప్రతీ కాలనీలో చిత్తశుద్ధితో ,ప్రతి రోజు గృహాలను దర్శించి,పేరెంట్స్‌కు స్టూడెంట్ కిట్స్,మధ్యాహ్న భోజన పథకం,తల్లికి వందనం స్కీమ్స్ అవగాహన కల్పించి,పూర్తిస్థాయిలో బడి ఈడు పిల్లలను,బడిలో చేర్పించాలిన కోరారు.ఈ కార్యక్రమం జూలై 12లోపల పూర్తి చేయాలని,చేసిన తర్వాత ఆ గ్రామాన్ని బడి బయట పిల్లలు లేని గ్రామంగా ప్రకటించాలని తెలియజేశారు.మండలం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముస్లింల మత విశ్వాసాలను దెబ్బతీయవద్దని చెప్పినందుకే తనపై తప్పుడు కేసులు



**నెల్లూరు టౌన్, జూన్ 25, ప్రభాతవార్త** ముస్లింల మత విశ్వాసాలను దెబ్బతీయవద్దని చెప్పినందుకు నెల్లూరు రూరల్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీగా ఉన్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకుని తనపై పీడీ యాక్ట్‌తో పాటు ఐపీసీ సెక్షన్ 307 అక్రమ కేసులను బనాయించారని ముస్లిం మైనార్టీ నేత సయనయద్ సమీ హుస్సేని ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూ రులో మంగళవారం ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తనపై మోపిన అక్రమ కేసులకు సంబంధించి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తన బిడ్డల పై ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. తనపై అక్రమ కేసులు బనాయించినందుకు ఆదాలకు భగవంతుని చేతిలో మూల్యం చెల్లించుకోక తప్పదని, ఆ పని ఇప్పటికే మొదలైందన్నారు. నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గా వద్ద ముస్లింల విశ్వాసాలను దెబ్బ తీశారని ఆయన ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు రకరకాలు విష ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ చేసిన అచారకాలకు తాను నిలువెత్తు నిదర్శనమన్నారు. తాను ఏ తప్పు చేయకపోయినా ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రోత్సాహంతో పీడీ యాక్ట్‌ను అక్రమంగా బనాయించి 3 నెలల 15 రోజులు కడప జైల్లో పెట్టారన్నారు. ఈ సమయంలో తన భార్య బిడ్డలకు తన క్షేమ సమాచారాన్ని కూడా తెలియనివ్వలేదన్నారు. వీటన్నింటికి ఫలితాన్ని ఆదాల అనుభవించాలన్నారు. అధికారం పోగానే వైసీపీ నుంచి రాజకీయ నరబోకర్లు, జోకర్లు సీజన్ భాయ్స్ గత మూడు రోజులుగా రకరకాలుగా మాట్లాడుతున్నారని, సోషల్ మీడియాలో విష ప్రచారం చేసిన ఓ వ్యక్తి తనను చంపి వేస్తారని తాను ఒక ముస్లిం కావడం వల్ల అని చెబుతూ నంగి వేషాలు వేస్తున్నాడని విమ ర్శించారు. తనపై అక్రమ కేసులు బనాయిస్తే ఈ వ్యక్తి అప్పుడు ఎక్కడికి వెళ్లాడని, ఆ రోజు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఓ నయ వంచకుడన్నారు. తనపై మోపిన కేసులకు సంబంధించి ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకుని వెళ్తానన్నారు. కోటంరెడ్డి సోదరులు నిత్యం ప్రజల్లో ఉన్నారు కాబట్టే వారు 35 వేల భారీ మెజార్టీతో గెలుపొందారన్నారు. ఆదాల చరిత్ర ముగిసిపోయిందని ఆరోగ్యం కూడా సహకరించడం లేదన్నారు. వైసీపీ కార్యకర్తలు ఆదాలను నమ్ముకుంటే నట్టేటా మునగడం ఖాయమని వారు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు.